# లేతచిగురు మాడిపోయింది

"మదార్‌సాయిబు ఎక్కడికి వెళ్ళాడు? కనబడటం లేదు? మీ యింటికి వచ్చాడా?" సుబ్బయ్యవచ్చి అప్పలసామి యింట్లోకి తొంగిచూశాడు. అతడు చాలా తొందరపనిలో ఉన్నట్టు ఆ ముఖంలో ఆదుర్దాయే చెబుతోంది. మదార్ సాయిబు లేకపోగానే గిర్రున వెనక్కుతిరిగి వీధిలోకి పరుగుతీశాడు.

మదార్‌సాయిబు కోసం అలా ఇల్లిల్లూ తిరుగుతునే ఉన్నాడు పొద్దుటినుంచి. సుబ్బయ్య వెళ్ళినచోటికల్లా రామరాజు కూడా అతడికోసమే ఇల్లిల్లూ తిరుగుతున్నాడు.

"ఎక్కడికి వెళ్ళినట్లు- ఇంత పొద్దటిపూట?''

"ఎవరు పని చెప్పారు?"

"అందరికీ అతడితో అవసరాలుంటాయి?"

పదిగంటలవరకూ తిరిగి ఉస్సురంటూ ఇంటికి చేరుకున్నారు.

అది ఒక చిన్న పల్లెటూరు. వృద్ధులూ పసిపిల్లలతో కలుపుకుని మూడు వందల జనాభాగల ఊరనిపించుకుంటుంది. ఎందరో సర్‌పంచ్‌లు వచ్చారు. ఎందరో సభ్యులు వచ్చిచూశారు. ఆ ప్రాంతంలో అటువంటి పల్లెలు మూడునాలుగు ఉన్నాయి. వచ్చినప్పుడు "మనం మన సభ్యత్వము పూర్తయ్యేలోపున ఈ ఊళ్ళను కలపటానికి డొంకలుకొట్టించి మట్టిరోడ్డయినా వేయించాలి. వీధి దీపాలు పెట్టించాలి" అని అక్కడున్నంతసేపూ అనుకుంటారు. జిల్లాపరిషత్ సభ్యులు ఆ ఊరి మీదుగా వెళ్ళినప్పుడు "సర్‌పంచ్ వారేంచేస్తున్నారు? గ్రామానికి ముఖ్యమైన హంగులు మంచినీళ్ళబావి తవ్వించలేదు, వీధులు ఏర్పడలేదు, వీధి దీపాలయినా పెట్టించకుండా ఏంచేశారింతకాలం?" అని వారి నాక్షేపణచేస్తూ ఉంటారు. ఎలక్షన్లు వచ్చేముందర తమ సభ్యత్వమూ, తమను సపోర్టుచేసేవారి సభ్యత్వమూ దక్కించుకునే ఏర్పాట్లల్లో మునిగిపోతారు అందరూ.

ఆ గ్రామంలో అందరికీ కనీసం ఎకరమో అరఎకరమో భూమి ఉన్నది. వాళ్ళపొలంపని చూసుకుని వ్యవసాయపు కూలీపనికూడా ఆ ఊళ్లోనే చేసుకుంటారు. చిన్నకారు రైతులతోపాటుగా అరవై ఎకరాల వరకూ ఉన్న ఆసాములు కూడా ఉన్నారక్కడ. ఏమీ సదుపాయంలేని రెండు గ్రామాలకు కలిసి ఒకబావి ఉంది. అదే వారి నీటివసతి. ఆ భూములలో పండేదంతా మెట్టపంటలే. వర్షం వచ్చినప్పుడు పండుతాయి. అందరికీ ఇంతో అంతో వ్యవసాయము ఉంది కనుక ఎడ్లజతలూ, గొడ్లూ వారి స్థితినిబట్టి ఉన్నాయి.

ఆ ఊరికొకరోజున మహమ్మదీయ దంపతులు చిన్న బిడ్డనెత్తుకుని వచ్చారు. వాళ్ళకు మొదలు సుబ్బయ్యగారిల్లే ఎదురయింది. దుమ్ము రేగిన కాళ్ళతో లుంగీ, దానిమీద కుడతా, ఛడాపులూ, తలకు గుడ్డతోకట్టిన టోపీ పెట్టుకుని, చేతికర్ర తాటించుకుంటూ మహమ్మద్‌ఖాను ముందునడుస్తుంటే, తలమీద ముసుగుతో రెండేళ్ళ పిల్లవాడినెత్తుకుని కాలి చెప్పులు ఈడ్చుకుంటూ బీబీ అడుగులువేస్తూ వచ్చింది అతడి వెనక.

సుబ్బయ్య వాకిట్లో పందిరికింద నులకమంచంవేసుకుని, తలకింద బట్ట పెట్టుకుని చుట్టకాలుస్తూ పడుకున్నాడు.

అడుగుల చప్పుడువిని నోట్లోనుంచి చుట్టతీసి "ఏఊరు మీది? ఎవరు మీరు?" అడిగాడు జంకుతూ.

"మాది ఇక్కడ కాదు. ఉత్తరాదినుంచి వస్తున్నాం. అక్కడా, అక్కడా, కొన్నిరోజులుండి, మరి ఉండలేక, మరొకఊరు చేరుకుంటూ చివరికి ఇక్కడికి చేరుకున్నాం."

"మీరెవరు ?"

"అయ్యా మేము మహమ్మదీయులం. అన్నిపనులూ చేస్తాం బతకటానికి."

"అంటే ఇక్కడికి బతకటానికి వచ్చానంటావా ?" అడిగాడు సుబ్బయ్య లేచి కూర్చుంటూ.

"అవునయ్య."

"ఇక్కడ ఏముందని ? పదిమంది వచ్చిపోయేవాళ్ళుంటే పదిపన్లు పుడ

తాయి. భూమి మెరకభూమి. వానలు పడితేగాని మంచిపంటలు పండవు. మెరక భూముల్లో పండినపంటే ఇక్కడివాళ్ళు తింటారు. అందరికీ కొద్దీగొప్పా వ్యవసాయ ముంది. అది చేసుకుంటారు నాలుగెకరాలు ఎక్కువఉన్నవాడు కూలీలను పెట్టు కుంటాడు. ఆ కూలీలూ ఇక్కడివాళ్లే. కొద్ది భూములున్నవాళ్ళు కూలికి వస్తారు వాళ్ళపన్లు చూసుకుని."

"ఎట్లగో బతికించండయ్యా" ఖాను ఒంగాడు దణ్ణంపెట్టటానికి.

"అయితే ఇక్కడే ఉండిపోతానంటావా? నీవు ఇల్లూవాకిలి చూసుకోవలసిందే. ఇళ్ళు అద్దెకుండవు."

"అవునయ్యా, మా యిద్దరికీ ఇంతజాగా ఇప్పిస్తే చిన్నగుడిసె కట్టుకుం టాము. ఇద్దరం మీకు పనిచేస్తాం" అన్నాడు ఖాను.

సుబ్బయ్య ఆలోచించాడు. తన ఎడ్లకొట్టం దగ్గరున్న ముళ్ళచెట్టు కొట్టేసి గుడిసెకు కావలిసినంత స్థలం ఇవ్వచ్చు గాని, మహమ్మదీయుడ నంటున్నాడు. ఏరాత్రివేళయిన ఇంటిమీదపడి జొన్నబస్తాలు ఎత్తుకుపోతే? సహాయానికి రమ్మని పిలిస్తే ఇతడినిచూసి ఎవరురారు. ఈ ఖానును ఎంతవరకు నమ్మవచ్చు? ఊళ్ళ వెంట తిరుగుతున్నవాడికి భయమేముంది? ఇవాళ ఈఊరు, రేపు మరొక ఊరు. మతకలహాలు ఒకరినొకరు చంపుకోవడాలు వింటున్నాము. మనసు తర్జన భర్జన పడుతోంది.

"ఏమయ్యా, తెల్లారకముందు ఇంత చద్దిబువ్వతిని బయలుదేరినం, నడిచి నడిచి ఈ ఊరు చేరుకున్నం. చింతచెట్టుకాడ నడుంవాలుద్దమంటే ఊళ్ళోకిపోయి ఎవరింట్లోనన్న ఇంతచద్ది అడుక్కుందామని బీబీ అంటే ఇటు వచ్చినామయ్యా."

"మా భాష తెలుగు బాగా మాట్లాడుతున్నావు? మరి, నీవు మహమ్మదీయుడ నంటావేమిటి ?"

"ఉత్తరాదినుంచి తెలుగుదేశం మీదుగా వస్తున్నాం. తెలుగుదేశంలోనేచాలా రోజులున్నాము. వరదల్లో వాళ్ళభూములన్నీ పాడయినాయి. ఇంక అక్కడినుంచి నడిచి ఒక్కొక్క ఊరు దాటుకుంటూ, ఉండవసతిలేక, ఈ దిక్కు బయలు దేరినాం."

ఆ ఊళ్ళో ఒక్కరిదగ్గరే ట్రాన్సిస్టర్ ఉంది. పొద్దునలేచి ముఖంకడుక్కో-

కుండా వార్తలు విని ఇంటికివస్తాడు సుబ్బయ్య. ఖాను చెప్పినమాటలు నిజమే. కోతకు వచ్చినపైరు ముంపుకు పాడయిపోయింది. ఎక్కడ చూసినా నిలువెత్తు నీరు. గింజ నానిపోయింది. రైతాంగం చాలా నష్టపోయింది.

"నీవిక్కడే ఉంటావని నమ్మకం కుదిరితే నీకేంకావాలో చూస్తాము" అన్నాడు.

"మా అల్లాతోడు, నేనింతవరకూ ఎవరినీ మోసగించలేదు. ఖాను మాటంటే మాటే" ఎర్రబడిన కళ్ళను అంగరముతో ఒత్తుకున్నాడు.

అప్పటికి సుబ్బయ్యకు లేవబుద్ధయింది. లోపలికి వెళ్ళి భార్యనడిగి విస్తరాకులో ఒక మనిషికి సరిపడ జొన్నన్నం తెచ్చాడు. దానిలోకి చిన్నముంతతో గోంగూరపులుసు తెచ్చిపెట్టాడు.

సుబ్బయ్యకు సలాంపెట్టి బీబీకి జొన్నన్నంపెట్టిన విస్తరియిచ్చాడు ఖాను. బైట చెట్టుకింద ముగ్గురూ తలాఇంత తిన్నారు. ముంత తీసుకువచ్చి ''అయ్యా, దీనెడు నీళ్ళిప్పించండి."

సుబ్బయ్య భార్యను చెంబుతో మంచినీళ్ళు తీసుకురమ్మని కేకపెట్టాడు. ఆమె నీళ్ళు తీసుకురాగానే కొంచెం ముంతలో పోయించుకుని దానిని బైటకడిగి తీసుకువచ్చి, మంచినీళ్ళు పోయించుకుని ముగ్గురూ తాగారు. ఇంటి ఆవరణం దాటిన తరువాత ఉన్న చెట్టుకింద, ముగ్గురూ విశ్రమించారు.

వెంటనే సుబ్బయ్య లేచివెళ్ళి రాజయ్యను సంప్రతించాడు. అంతావిని,"మన ఊళ్లో మననేంచేస్తాడు ? నీ దగ్గర వీలుగాఉంటే చూడు. లేకపోతే రచ్చబండ అవతలగా రెండువందలగజాల స్థలం ఉంది. ప్రస్తుతానికి గుడిసెవేసుకోమను" అన్నాడు రాజయ్య.

''ఆ జాగా ఎక్కడోఉన్న బాగయ్యది కదా?"

"బాగయ్యదే కాని ఆ జాగా ముఖంచూసినవాడు లేడు. వాడి కొడుకులు గాని తండ్రిగాని ఇటువైపు రాలేదు. పదేళ్ళపైన అయింది."

సుబ్బయ్య ఆలోచించాడు. భూమి గలవాడు ఇటు తిరిగిచూడటంలేదు. ఉండబోయేవాడు ఆగంతకుడు. బాగయ్యవచ్చి తనను అడగడు. అడిగినప్పుడు,

ఖానే ఖాలీజాగాలో వేసుకున్నట్టు జవాబు చెప్పగలడనుకుని ఇంటికివచ్చి "నీకు మంచిచోటు చూసివచ్చాను, చూపిస్తాను. రేపటినుంచి గుడిసె ప్రయత్నం చేసుకో మన్నాడు. ఆరాత్రికి వాకిటి వసారాలో పడుకోమన్నాడు.

అప్పుడు, అలా, సుబ్బయ్య సహాయంతో ఆ ఊళ్ళో ఖాను కుటుంబం స్థిరపడిపోయింది. చింతచెట్టు కొమ్మలు కొట్టుకుని గుడిసెకు ఆకారం తెచ్చాడు ఖాను. కట్టె కంప దానిమీద కప్పాడు. చెట్లకొమ్మలు ఆకులు దానిమీద వేశాడు అవి కదిలిపోకుండా దానిమీద రెండు మొద్దులు పడేశాడు.

ఆ రాత్రికి సుబ్బయ్య జీతగాడు విస్తట్లో జొన్నన్నం తెచ్చిపెట్టాడు వడ్ల బస్తాలమీద కప్పిన ఒక ఈతాకుల చాప తెచ్చియిచ్చాడు.

ఖాను ఆ ఊరువచ్చి స్థిరపడ్డాడని తెలిసి, పొలాలకు పోయేవాళ్ళు, పనుల మీద వెళ్ళేవాళ్ళూ అతడిని విడ్డూరంగాచూస్తూ కాసేపునిలబడి వెళ్ళేవారు. ఆనాడది ఒక వింతవిషయమయింది అందరికీ.

మరునాడు సుబ్బయ్యగారింట్లో జొన్నలు తొక్కుతుంటే జీతగాడికి సహాయ పడ్డాడు ఖాను. గొడ్లసావడి ఊడ్చిపెట్టాడు. పాలుపితికి సుబ్బయ్య భార్యకిచ్చాడు.

"ఎక్కడ నేర్చుకున్నావు? అలవాటుగా పిండావు?"అని అడిగిందామె.

"మీలాంటి ఇళ్ళల్లో ఉండి అలవాటు చేసుకున్నాను" అన్నాడు.

"బావిలోనుంచి నీళ్ళుతెచ్చి తొట్లు నింపుతావా '' అడిగింది.

"బుంగాచేద ఇవ్వండి'' అన్నాడు. ఆమె బావి ఎటువైపు ఉన్నదో చూపించింది.

ఆనాటినుంచీ అతడికి సుబ్బయ్య ఇంట్లో కొన్నిపనులు స్థిరపడిపోయాయి. వెళ్ళేటప్పుడు, అర్ధశేరుజొన్నలు, వండుకోవటానికి ఒక కుండ ఇచ్చింది. ఊరగాయముక్క ఆకులో వేసింది. చిన్నముంతెడు మజ్జిగ ఇచ్చింది, సుబ్బయ్య భార్య.

బీబీ ఆప్యాయంగా వాటినందుకుని చితుకులతో మంటచేసి వంటచేసింది. ఖాను వచ్చేటప్పుడు చేతికి తగిలించుకుని తెచ్చిన మూటలో పరచుకోటానికి రెండు గొంగళ్ళు, కప్పుకోటానికి రెండుదుప్పట్లు, మారుబట్టలు ఉన్నాయి. ఈతాకుల

చాపమీద కంబళ్ళు పరచుకుని మధ్యాహ్నం కొంచెంసేపు విశ్రాంతి తీసుకున్నారు.

సుబ్బయ్య తను చేసిన ఘనకార్యం ఊరంతా చెప్పాడు. అందరూ వచ్చి ఖానును పిలిచి, పని చేయించుకుని, పనిని బట్టి సోలెడు మానెడు, జొన్నలుకొలిచి పోసేవారు.

అక్కడికి ఖాను కుటుంబం వచ్చిన తరువాత కుండలు మూకుళ్ళు తెడ్లు ఇంటికి అవసరమైనవి ఒక్కొక్కటే కొనుక్కొంటున్నారు దంపతులు-ముగ్గురి వంట కోసం.

అక్కడి మూడుఊళ్ళకూ ఏమీతేడా లేదు. ఆ ఊళ్ళల్లో ఏమీ దొరకదు. ఆ ఊరికి పదిమైళ్ళ దూరంలో మర్లపాడు అనే గ్రామముంది అక్కడ అన్ని వస్తువులు దొరుకుతాయి. ఈ మూడు ఊళ్ళవాళ్ళకూ ఆ ఊరు రోజుకొకసారి అయినా వెళ్ళి సరుకులు తెచ్చుకోవలసి వస్తుంది. అక్కడ ఆ గ్రామస్థులకు ఉపయోగ పడే బట్టలు కూడా దొరుకుతాయి గ్రాసంతోపాటు.

ఆ ప్రాంతానికి బస్సురూటు పడుతుందని ఒకవార్త ఊరంతా పాకింది. ట్రాన్స్పోర్టుగల ఆయన ఇంటికివెళ్ళిఆ సంగతి ఎంతవరకూ నిజమో కనుక్కొచ్చారు. త్వరలో పడుతుందని తెలిసింది.

ఆ మూడు ఊళ్ళవాళ్ళకు విద్యాసౌకర్యంలేదు. ఆ మూడుఊళ్లూ దగ్గర దగ్గరగా ఉన్నాయి కనక ఒకటిచర్చి మర్లపాడు నుంచి పిలిచి ఒక స్కూలు పెట్టించి పిల్లలను చదివించాలనుకున్నారు. కాని కలిసిరాలేదు. చదువుచెప్పించ దలచుకున్నవాళ్ళు మర్లపాడులో పిల్లలతో కాపరాలు పెట్టారు.

ఖాను పిల్లవాడు పెద్దవాడయ్యాడు మహమ్మద్ అనటం చేతకాని వాళ్ళు మదారుసాయిబు అని పేరు పెట్టారు. అతడు తండ్రితో కూడా చిన్న చిన్న పనులు చేసేవాడు. అతడికీ జొన్నలు లభించేవి. ఇంటికితెచ్చి కుండలో పోసేవాడు, మధ్యాహ్నంవేళ తండ్రి దగ్గర 'అలీఫ్,బే'.... చదువుకునేవాడు.

మదారుసాయిబును తీసుకుని ఖాను మర్లపాడు సామాన్లకు ఎవరు పంపించినా వెళ్ళేవాడు. సరుకు మోసుకుని తెచ్చేవాళ్ళు ఇద్దరూ.

అక్కడ వరిపంట తక్కువ కనుక ఇంటికి ఎవరయినా చుట్టాలు వచ్చినా అల్లుళ్ళు పండుగకు వచ్చినా బియ్యం సెనగపప్పు పిండి, వంట సరుకులు తేవ

టానికి వీళ్ళిద్దరికోసం వెతుకుతూ ఉండేవారు. ఒకోరోజు రెండు మూడుసార్లు కూడా పంపుతూ ఉండేవారు.

సుబ్బయ్య ఇంటికి మొట్టమొదట ఖాను వచ్చాడు. సుబ్బయ్యే అతడిని కొన్ని వారాలు ఆదుకున్నాడు కనుక అతడిమీద సుబ్బయ్య తనకే అన్ని బాధ్యతలూ అధికారాలూ ఉన్నాయనుకున్నాడు. నలుగురినీ పిలిచి "ఈ ఖాను తండ్రీకొడుకులిద్దరినీ పిలిచి పనిచేయించుకోనివారు లేరు. మర్లపాడుకూడా ఒకటికి రెండుసార్లు తిప్పుతున్నారు. ఉన్నవాళ్ళు తలా ఒకబస్తా జొన్నలు ఇస్తేగాని వాళ్ళు బతకలేరు. మిగతావాళ్ళు మార్లపాడు' పంపించకుండా ఇక్కడే చిన్న చిన్న పనులు చేయించుకుని ఏదో ఒకటి ఇస్తూ ఉండండి" అని ఒప్పందం చేశాడు.

ఆ మూడు ఊళ్ళవాళ్ళకూ ఎంతో సౌకర్యంగా ఉంది, వీళ్ళరాకతో. ఇచ్చేది డబ్బుకాదు కనుక పండినపంట ఇవ్వటానికి వేనుదీసేవారు కాదు. మొత్తమ్మీద ఖానుదంపతులు ఆ గ్రామస్థులకు బాగా అలవాటయ్యారు. వాళ్ళల్లో కలిసిపోయారు. ఒకరి కష్టసుఖాలు ఒకరు పంచుకుంటున్నారు. ఎవరికి జబ్బు చేసినా మదారుసాయిబు మర్లపాడువెళ్ళి వైద్యుడిని తీసుకు వచ్చేవాడు. మందులు కూడా వెళ్ళి తెచ్చేవాడు.

మదారు సాయిబు ఒకనాడు మర్లపాడునుంచి వస్తూ ఒక కుక్కను తీసుకు వచ్చాడు. అది వాళ్ళ ఇంటిముందరే ఉండేది మదార్‌సాయిబుతో కూడా తిరిగేది. ఊరంతా తిరిగొచ్చి ఇంటిముందర పడుకునేది.

ఒకనాడు-ఊరుకోక మదారుసాయిబు అందంగా ఉందని ఇంకో కుక్కను తీసుకు వచ్చాడు.

"వీటికి తిండి పెట్టాలి కదరా? ఇట్లా కుక్కల పెంపకానికి పూనుకున్నావు? ఏమిటి?" తల్లి మందలించింది.

"వాటి కడుపెంత? వాటి తిండెంత? మనతోపాటు పెట్టు" అనేవాడు. వాటి వల్ల కలిగే లాభాలను ఎన్నో కల్పించి చెప్పేవాడు. తల్లిదండ్రులు ఇద్దరూ నవ్వుకుని అతడితోబాటు వాటిని కూడా గారాబంచేసేవారు. మగకుక్క నల్లగా ఉండేది. ఎక్కడా మచ్చలేకుండా దానిపేరు బ్లాకీ. ఆడకుక్క తెల్లగా ఉండేది. దానిపేరు వైట్..

ఒకసారి ఒక పెద్ద ఆసామి యింట్లో దొంగలు పడ్డారు. ఆ ఊళ్లో దొంగలు పడటం అరుదు. వచ్చినప్పుడు ముఠాలుగా వచ్చి, దోచుకుంటారు. పండినధాన్యం పది బస్తాలు ఎత్తుకుపోయినా ఆ రైతుకు పెద్దదెబ్బే. ఏదిశనుంచో అరుపులు వినిపించి మదారు సాయిబు వెళ్ళుతుంటే కుక్కలు వెంటబడ్డాయి. ఇద్దరుదొంగలు బస్తాలు ఎత్తుతున్నారు. ఒకడు అప్పటికే తలకెత్తుకున్నాడు. ఈ కుక్కలు రెండూ వాళ్ళను చూడగానే మదారుసాయిబు కనుసైగలతో వాళ్ళమీదికి దూకి బస్తాలను కింద పడేశాయి. వాళ్ళ కాళ్ళ కండలు బైటికి వచ్చేటట్టు పీకేశాయి. బస్తాఎత్తుకున్నవాడు. దాన్ని అక్కడే పడేసి పారిపోయాడు. మిగిలిన ఇద్దరూ రక్తం కారుతున్న కాళ్ళమీద బాగా దెబ్బలుతిని పరుగుతీశారు.

ఆ మూడు గ్రామాలకూ ఈ వార్త పాకింది గాలి వాటుగా, ఎంతనిజమోనని అందరూ మదారుసాయిబునూ అతడి కుక్కలనూ తెల్లవారగానే వచ్చిచూశారు. అందరికీ ఆశ్చర్యం కలిగింది.

ఆ మూడు ఊళ్ళకూ ఇది ఎంతో ఆశ్చర్యకరమైన విషయం. అందరూ అతడినీ అతడి కుక్కలనూ ఎంతగానో పొగిడారు. ఇద్దరు ముగ్గురు ఆసామీలు కలిసి మదారుసాయిబుకు ఒక పైజామా కుడతా కుట్టించి పెట్టారు. అతడి కుక్కలకు మెడకు తగిలించే గొలుసులు కొన్నారు.

ఆ మూడు ఊళ్ళకు ఇంక దొంగలభయం ఉండదన్న నమ్మకం ఏర్పడ్డది. ఖాను కుటుంబము తమను దొంగలబారి నుండి కాపాడటానికే వచ్చిందని సంతోషించారు.

ఇలా రెండుమూడేళ్ళు గడిచాయి. మదారుసాయిబు మెషీనుకొని బట్టలు కుడతానని తండ్రి దగ్గర మారామ్‌చేస్తున్నాడు.

"బేటా, అంతడబ్బు మనకెక్కడిది? మనమే వాళ్ళ దయతో బతుకుతున్నాం."

"నేను బట్టలు కుట్టి డబ్బు సంపాయిస్తా. అప్పుడు మనకు ఎవరిదయ అక్కర్లేదు. మర్లపాడులో ఒక టైలరు రోజుకు రెండుగంటల సేపు నేర్పిస్తానన్నాడు. అతడే మెషీను తన బాధ్యతమీద ఇప్పిస్తానన్నాడు. బట్టలు కుట్టి, నేను తీర్చుకుంటాను. నేను పెద్దవాడినయినాక కూడా నీవు అందరికీ బావిలో

నుంచి నీళ్ళతోడి గాబులు నింపుతూ ఉంటావా? వీల్లేదు బాబా, ఆపని నీవు చేయద్దు."

"నీవు సంపాదించేవరకూ తోడనిస్తావా? ఎంతవాడివయినావురా. బేటా, నీ మాటలే సంబరంగా ఉన్నాయి. అమ్మీకి చెప్పావా?" అన్నాడు సంబరపడి

"అమ్మీ ఎప్పుడూ నామాటే వింటుంది." అంటూ సమర్థించుకున్నాడు.

ఇంట్లో అన్నంతిని, ప్రతిరోజు మర్లపాడు వెళ్ళి ఆ ఊరివాళ్ళు వేసుకునే బట్టలు టైలరు కత్తిరించి ఇస్తే మెషీనుమీద కుట్టటం నేర్చుకున్నాడు. తరువాత ఆడవాళ్ళబట్టలు కుట్టటం నేర్చాడు. ఊళ్ళో వాటిని అందరిని చూపించి వాళ్ళ బట్టలు తీసుకుపోయి కుట్టుకుని వచ్చేవాడు. వాళ్ళు డబ్బులిస్తే తీసుకునేవాడు.

ఈ లోపల మరొకసారి దొంగలముఠా వచ్చి బండిమీద జొన్నలబస్తాలు ఎక్కించుకుంది మదారుసాయిబుకు తెలిసి కుక్కలను తనతో కూడా తీసుకు వెళ్ళాడు. కుక్కలు వాళ్ళమీదపడి బట్టలుచింపి అందిన చోటల్లా కొరికి గల్లంతు చేశాయి. దొంగలముఠా నలుగురు అయినా రెండు కుక్కలనుచూసి భయపడి పోయారు. ఇద్దరు గాయాలతో నడవలేకపోయారు. ఆ సమయంలో మదారు సాయిబే బండిలో ఉన్న బస్తాలు కిందపడేసి, మరో ఇద్దరి సహాయంతో దొంగలను బండిలోకి ఎక్కించాడు. వాళ్ళు అదే చాలని దైవాన్ని తలుచుకుంటూ వెనక్కి మళ్ళారు.

దీనితో మదార్‌సాయిబు కుక్కలకు అమితవిలువా, అతడికి మరింత గౌరవమూ కలిగాయి. ఇంక తల్లిదండ్రులు సరేసరి-బేటా బేటా అంటూ అతడిని నేలమీద నడవనివ్వలేదు ఒకరోజంతా.

మదార్‌సాయిబు ఆ వూరి అసామీలకు వాళ్ళు తొడుక్కునే పొట్టిచేతుల చొక్కాలు కుట్టి తీసుకువచ్చాడు. వాటినిచూసి వాళ్ళు పొంగిపోయి "మేమే హామీఉండి "నీకు మెషీను కొనిస్తా"మన్నారు. ఈలోపల అతడు మగవాళ్ళకు బుష్‌షర్టు, మగపిల్లలకు పాంట్లు కత్తిరించటంకూడా నేర్చుకున్నాడు. మెషీనుకొని యిచ్చిన తరువాత, స్వయంగా కుట్టటం మొదలుపెట్టాడు. మూడుఊళ్ళవాళ్ళే కాకుండా ఇంకా ఇతర ఊళ్ళనుంచికూడా వస్తున్నారు బట్టలుకుట్టించుకోవటానికి.

మదార్‌సాయిబుకు గిరాకీహెచ్చింది. అతడి కుక్కలు మాంసముపెట్టటంతో

ఆ దారినకూడా ఎవరినీ నడవనీయకుండా, అతడు చెట్టుకింద మెషీనుపెట్టుకుని కుడుతుంటే చెరొక వైపునా కూర్చునేవి గుర్రుమంటూ.

అయిదారు సంవత్సరాలలో అతడి ప్రతిభ అచుట్టుపక్కల ఊళ్ళకు బాగా పాకిపోయింది. యువకుడైన మదార్‌సాయిబును వెతుక్కుంటూ జనం వస్తున్నారు.

పైఊళ్ళనుంచి జనం వస్తూపోతుండటంవల్ల ఆ మూడుఊళ్ళమధ్య కాలి బాటలు ఏర్పడ్డాయి.

"ఎంతకళ వచ్చిందయ్యా నీవల్ల ఈ ఊరికి? సర్పంచ్‌తో మాట్లాడి దీపాలకు ఏర్పాట్లు చేయిస్తానయ్యా. నిన్నుకూడా ఆయన దగ్గరికి తీసుకుపోతాను. ఒకరోజు వీలుచేసుకో" మని కోరాడు ఒక పెద్దరైతు.

"కత్తిరించిన బట్టలయిపోనీయండి వెళ్దాం."

"అట్లాగే దీపాలు పెట్టించే ఏర్పాటుచేస్తాను. మీవంటి యువకులు ఊళ్ళు బాగుచెయ్యటానికి ముందుకువచ్చి, మామీదఒత్తిడి తీసుకురావాలి. మీ ఒత్తిడివల్లనే పనులవుతాయి మా పైఅధికారులదగ్గర." అంటూ బుజంతట్టి మాట్లాడి పంపించాడు సర్పంచ్.

మదారుసాయిబు తల్లిదండ్రులు ఆజానుబాహులు గులాబీరంగులో హుందాగాఉంటారు. వాళ్ళకు సరైన శరీరపోషణ ఉన్నట్లయితే నవాబు వంశీయులలా ఉంటారు. పాపం వాళ్ళు, పరిస్థితుల ప్రాబల్యంవల్ల శుష్కించిపోయినా, ఈ ఊరువచ్చిన తరువాత కొంచెం పుంజుకోగలిగారు. ఇంక మదార్‌సాయిబు మంచి యౌవనంలోఉన్నాడు. కొట్టవచ్చినట్టున్నరంగు, ముఖవర్చస్సు, అతడికి రాజఠీవిని తెచ్చిపెట్టాయి. ఇంకా అతడు తగిన దుస్తులతో ఉన్నట్లయితే నవాబు కొడుకు మాదిరిగానే ఉండేవాడు.

అతడిని చూసిన గ్రామస్థులుకూడా చాలా గౌరవంగా పలకరిస్తూఉండేవారు లోలోపల బిక్కుబిక్కుమంటూ.

పెద్దరైతు మదార్‌సాయిబు కూడావెళ్ళిన ఐదుసంవత్సరాలకు దీపాలకు ఏర్పాట్లు జరగటం ప్రారంభమయింది.

"వీళ్ళు మన ఊరికి సంపదతెచ్చిన దేవతలు, ఇంతకాలమైంది మనందరం

దరఖాస్తులు పెట్టి, వెళ్ళి స్వయంగా మొర పెట్టుకుంటిమి. గుంపుగాపోయి కాళ్లమీద పడితిమి. ఇటు తిరిగిచూసిందా ప్రభుత్వం?" అనుకున్నారు.

దీపాలువచ్చిన తరువాత రైతులకు బావులు తవ్వుకోటానికి ఋణాలు, మంచినీళ్ళ వసతులు ఏర్పడ్డాయి. సర్పంచ్ శ్రద్ధతీసుకుని మట్టిరోడ్లయినావేయించి మూడు ఊళ్ళను కలిపాడు.

ఈ సౌకర్యాలు ఆ ప్రజలు అనుకోనివి - ఊహించనివి. అదే స్వర్గమని సంతోషపడిపోతున్నారు. వీళ్ళిట్లా ఇక్కడఉంటే త్వరలోనే పట్నమవుతుందని వాళ్ళు ఆశపడుతున్నారు.

నడిరేయి.

దశమినాటి చంద్రుడు మరి నాలుగు రోజులకు తనకు రాబోయే విపత్తుకు ఖిన్నుడై, మబ్బులను అడ్డంపెట్టుకుని సాగిపోతున్నాడు.

దీపాలు అక్కడక్కడ వెలుగుతున్నాయి.

ప్రజలందరూ నిశ్చింతగా నిద్రపోతున్నారు.

ఊరిబయట మూడు లారీలు ఆగిన చప్పుడైంది.

వైట్, బ్లాకీ చెవులు నిక్కబొడుచుకుని కళ్ళుతెరిచాయి. కాళ్ళు సాగదీసుకున్నాయి. తలుపు తెరిస్తే పరుగులు పెట్టటానికి సిద్ధంగా.

కారు సైన్యం లాఠీలతో లారీలు దిగింది. దిగుతూనే దీపాలు ఆర్పేశారు. ఒకదండు ముందుకు-ఒకటి కుడిచేతివైపుకు, మరొకటి ఎడమచేతివైపుకు పరుగులు తీశాయి.

మతోన్మాదుల ప్రోద్బలంతో- ఉద్రేకించిన మనసులతో కన్నూ మిన్నూ కానక ఎదురయినవాళ్ళ తలలు పగలగొడుతూ, కాళ్ళు నడుమూ విరగ్గొడుతూ, ఒక్కొక్కరు ముందుకుపోతున్నారు కత్తులు దూసిన సైనికుల్లా.

నాలుగు మూలలనుంచీ హాహాకారాలు వినవస్తున్నాయి. అరుపులూ ఏడుపులూ "చస్తినిరా నాయనా" రాగాలు వినబడుతున్నాయి.

వైటీ, బ్లాకీ లేచి మదారుసాయిబు కాళ్ళు గీకాయి. దిగ్గున లేచేడతడు.

అప్పటికే ఖాను కళ్ళుతెరిచి "బేటా ఏమిటా అల్లరి బైట?" అని అడుగుతున్నాడు కొడుకును. అతడి గుండె దడదడలాడు తున్నది. ఈ సైన్యం మతప్రధానమైంది. సైన్యమన్న మాటేగాని అదుపూ ఆజ్ఞాలేదు. విశృంఖలంగా కనబడిన వాళ్ళను చంపటమే వాళ్ళపని.

ఖానుపెరటి తలుపుతెరిచి బయటికి చూశాడు. సైన్యం అప్పటికే ఊరిని చాలా ధ్వంసం చేసింది. నేలమీదపడిన మనుష్యులు రక్తాలోడుస్తూ విలవిల తన్నుకుంటూ పొర్లుతున్నారు.

తలుపు తెరిచిన ఖాను తలమీద కర్రదెబ్బ పడ్డది. యా అల్లా అంటూ పడిపోయాడు తల పట్టుకుని.

బ్లాకీ వైట్‌లు రెండూ పరుగులుతీశాయి. కొందరికి పిక్కలలోనుంచి రక్తం ధారలుగా కారుతున్నది. కొందరిని ముందుకూ వెనక్కూ కొరుకుతూ ఈడ్చుకుపోతున్నాయి. వాళ్ళను వదిలిపెట్టి ముందుకు ఉరుకుతున్నాయి.

దూడలంత ఎత్తు పెరిగిన బ్లాకీ వైట్ ఎర్రటి కళ్ళతో వీరవిహారం చేస్తున్నాయి.

సైన్యము మనుష్యులను చావగొట్టి దారికిటూ అటూ నెట్టి పడేస్తున్నారు. వాళ్ళకొక మతమనిలేదు. దేశాన్ని నాశనం చేయటమే ధ్యేయంగా పెట్టుకున్నారు.

"ఒక్కళ్ళనయినా వదలద్దు. అందరినీ చంపెయ్యండి. గుడిసెలకు నిప్పు పెట్టండి" అరుస్తున్నారు.

మదార్‌సాయిబు తాటిమట్టతో కనబడిన వాళ్ళను చావబాదుతున్నాడు. తన కెదురయిన వాళ్ళను ఒడుపుగా తప్పించుకుంటున్నాడు. రైతులంతాలేచి కర్రలు తీసుకుని సైన్యాన్ని తరిమి తరిమికొట్టారు.

అంతలో పక్కఊరిని మట్టుబెట్టిన సైన్యము లాఠీలు తాటించుకుంటూ వచ్చి "ఈ శవాలన్నీ మనవాళ్ళవేనా ? ఈ ఊళ్లో జనంలేరా ? అందరూ ముగిసిపోయారా ?" అని అరుస్తూ పరుగులు పెడుతూ గుడ్డి వెన్నెలలో కనబడిన శవాలను వక్కఁకులాగుతూ మంటలకెదురు వెళ్ళారు.

మదార్‌సాయిబు రేగిన జుట్టుతో అలిసిపోయిన ముఖంతో పరుగు పరుగున

వచ్చినా అతడిలో ఉద్రేకం చావలేదు. చేతనయినంత మందిని తరిమి తరిమి కొట్టాలన్న ధైర్యము ఉంది. ఒకలాటీ చేతబట్టుకుని "ఏంచేస్తున్నారిక్కడ? ఎవరు మీరంతా ? ఈ ప్రజలను ఇట్లా చావగొట్టి కాల్చిచంపుతున్నారేమిటి ?" అని అరిచాడు.

"నీవెవరివి ? అప్పటినుంచీ ఎక్కడికి వెళ్ళావు ? ఉంటే నీకూ ఆగతిపట్టేదే" పదిమందీ చుట్టూ మూగారు. ఎంత కర్రసాము చేయగల నేర్పరి అయినా చుట్టూ మూగిన జనం అన్నివైపులనుంచీ కర్రలతో కొడుతూ కుళ్ళబొడుస్తూ ఉంటే ఆగగలడా ? పద్మవ్యూహంలోకి చొచ్చుకుపోయి బైటికిరాలేని అభిమన్యుడి మాదిరిగా పడిపోయినాడు. కింద పడినవాడిమీద కర్రలు కదనుతొక్కాయి. ఎక్కడివాళ్ళక్కడికి వెళ్ళుతూ "పొగరణిగింది. చచ్చాడులే పదండి" అంటు జారుకున్నారు.

తలకు బలమైన దెబ్బతగిలిన ఖానుకు రక్తమంతా తుడిచి అతడిని లోపలికి తీసుకువచ్చి పడుకోబెట్టి బీబీ, బ్లాకీ వైటీ అంటూ పిలిచింది. ఎంతసేపటికీ కుక్కలు రాలేదు.

బీబీ బైటికి వచ్చి బేటా బేటా అంటూ ఏడుస్తూ వీధులన్నీ తిరుగుతూ కనబడ్డ శవాన్నల్లా చూస్తూ వాళ్ళను దాటుకుంటూ కొడుకు పడిపోయిన చోటికివచ్చి ఒంగిచూసింది. మసకచీకట్లలో ఒళ్ళంతా తడిమిచూసింది. తన కొడుకేనన్న సందేహంవచ్చి ఎవరయినా సహాయానికి వస్తారేమో నని ఇటూ అటూ చూసింది.

ఎక్కడినుంచో బ్లాకీ వైటీ పరుగెత్తుకుంటూ వచ్చాయి. అవి పడిపోయిన మదార్‌సాయిబు చుట్టూతిరిగి వాసనచూస్తున్నాయి. బీబీ ఏడుస్తుంటే అవి కూడా కన్నీరు కారుస్తూ ఆమెపక్కన కూర్చున్నాయి.

కాలిపోయిన గుడిసెలను ఆర్పుకుని చావగా మిగిలిన రైతాంగం బీబీ ఏడుపులకు బైటికి వచ్చారు. ఖాను బీబీ ఇంకారాలేదని తలకు కట్టుకట్టుకుని కుంటుతూ వచ్చాడు. "బీబీ ! బేటా ఏడీ ? బేటా ఏడీ ?" అంటూ వస్తున్నాడు.

ఊరి కుర్రకారును వెంబడేసుకుని వాళ్ళచేత చెట్లునాటించి నీళ్ళు పోయిస్తూ ఆ ఊరు అందంగా ఉండాలని ప్రోత్సహించిన బాలచంద్రుడు అస్తమించాడు.

"అందరు పనిచేయండి. ఊరికే కూర్చోవద్దు. కసరత్‌చేసి బలం సంపా

దించండి. మన ఊరిని మనమే కాపాడుకోవచ్చని" యువతను పురికొల్పిన బాల వీరుడు నేలకొరిగాడు.

జాతివైరంతో ఊరినుంచి తరిమికొట్టబడిన ఖాన్ దంపతుల గారాబు తనయుడు, ఆ ఊరికి కొత్తవెలుగును తీసుకురావాలని శక్తికొద్దీ కృషిచేసిన మదార్ సాయిబు, రామదండు చేత హతమైనాడు.

ఆ సత్యాన్ని ఇంకా గ్రహించలేని ఖానుదంపతులు "మా యింటి చందమామ, బేటా బేటా లేతే" అంటూ తమ గుడిసెలోకి తీసుకువెళ్ళుతుంటే బ్లాకీ వైటీ కూడా వాళ్ళను నీళ్ళుకారుతున్న కళ్ళతో వెంబడించాయి.

ఆ మూడు ఊళ్ళూ మళ్ళీ గాడాంధకారంలో మునిగి తేల్తున్నాయి.